క్లుప్తంగా

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చిన్నమండెం : మండల పరిధిలోని పలు ఆంజనేయస్వామి ఆలయాలలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌మూర్తులను పలు పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ఆకుపూజలు, సింధూర పూజలు తదితర పూజాది క్రతువులను నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

సంబేపల్లె : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఎర్రగుంట్ల బస్టాప్ వద్ద ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పత్రాలను పరిశీలన చేశారు. వాహనదారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సకాలంలో పన్నులు చెల్లించండి



పన్ను వసూళ్లపై సచివాలయ కార్యదర్శులతో చర్చిస్తున్న కమిషనర్ వాసుబాబు

రాయచోటి అర్బన్ : పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వాసు బాబు కోరారు. శనివారం పట్టణంలోని వివిధ సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఇంటి పన్నుల వసూళ్ల ప్రక్రియను మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జునతో కలసి పరిశీలించారు. అధికంగా బకాయిలు ఉన్న ఇంటి, దుకాణాల యజమానులతో ఆయన మాట్లాడారు. అధిక బకాయిదారులు పన్నులను వడ్డీ మినహాయింపుతో చెల్లించేందుకు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 1 నుంచి పన్నులను వడ్డీతో సహా చెల్లించక తప్పదన్నారు. పుర ప్రజలందరూ వడ్డీ మినహాయింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి మాసూమ్‌బాషా, జూనియర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా చేయాలి



విద్యుత్ ఆదాపై గీచిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

రామాపురం : విద్యుత్‌ను ఆదా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కస్తూర్బా బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత అన్నారు. ఎంజేసీ ఏసీ బీసీ డబ్ల్యూఆర్ఇఐ సొసైటీ ఆదేశాల ప్రకారం ఎనర్జీ కన్సర్వేషన్ సంబంధించి విద్యార్థులకు మండల పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. ఎనర్జీ కన్సర్వేషన్‌కు సంబంధించి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల స్థాయిలో ఎనర్జీ కన్సర్వేషన్ పైన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ స్థాయిలో నిలిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం

గాలివీడు : ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ వారి ఆదేశాలతో ఆయన శనివారం మండల కేంద్రంలో పలు సూచనలు, సలహాలు చేశారు. గర్భిణులు, చిన్నారులు, వయోవృద్ధులు మధ్యాహ్నం తరువాత బయట తిరగరాదన్నారు. అత్యవసరమైతే గొడుగు, టోపీ, రూమాలు ధరించి వెళ్లాలన్నారు. ముఖ్యంగా ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ నీటిని తాగాలన్నారు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు తలతిరుగుట, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వడదెబ్బగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో శీతల వాతావరణంలో దగ్గరలోని ప్రాథమిక కేంద్రానికి తరలించాలని సూచించారు.

ప్రజా సంక్షేమం కోసం మళ్లీ జగనన్నను సీఎం చేద్దాం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డి

రైల్వేకోడూరు : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జరగబోవు ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకుందామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించడానికి ముందుగా సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డితో కలిసి పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం, అభయాంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై స్థానిక ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ఆయన ప్రజలకు వివరిస్తూ మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఈ 57 మాసాల తమ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, ఇతర పథకాలు, నాడు నేడు, జగనన్న ఇళ్లు, ఆసరా, విద్యాదీవెన, అమ్మ ఒడి ఇలా ఎన్నో పథకాలు ప్రతి గడపకు చేర్చిన ఘనత దేశంలోనే ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ పరిపాలన కొనసాగుతుందని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎక్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జెడ్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, బండారు మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్‌కు ఏర్పాట్లు పూర్తి

నేడు సమాధుల తోటలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



సమాధులను సుందరంగా తీర్చిదిద్దుతున్న క్రైస్తవులు

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవులు, విశ్వాసులు ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ తరువాత ముఖ్యమైన పండుగ ఈస్టర్. క్రీస్తుకు శిలువ వేసిన తరువాత తన మరణం నుంచి మూడవ రోజు పునరుత్థానం పొందారు. అందువల్ల క్రైస్తవులు, విశ్వాసులు ఈస్టర్ పండుగను జరుపుకొంటారు. ఇందుకోసం క్రైస్తవులు, విశ్వాసులు సమాధుల తోటలోని సమాధులకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఈస్టర్ రోజున వేకువజామునే సమాధుల వద్దకు చేరుకొని పుష్పాలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే చర్చిల్లోను ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో క్రైస్తవుల సందడి కనిపిస్తోంది.

సమష్టిగా పోలింగ్‌ను విజయవంతం చేయాలి





శిక్షణలో పాల్గొన్న పీవో, ఏపీవోలు, శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఆర్వో మోహనరావు

రాజంపేట : అందరూ కలసికట్టుగా ఎన్నికల పోలింగ్‌ను విజయవంతం చేయాలని రాజంపేట ఆర్వో మోహనరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల రోజుల్లో పీవోలపై గురుతర బాధ్యత ఉంటుందన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి తాము ఇచ్చిన శిక్షణతోపాటు ఎన్నికల నిబంధనల నియామవళిపై పట్టు సాధించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పీవో, ఏపీవో, పోలింగ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. ముందుగా మాక్ పోలింగ్‌ను ఎన్నికల సంఘం కేటాయించిన సమయంలో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత పీవో, ఏపీవోల విధులను, బాధ్యతలపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఈవీఎం ఆపరేటింగ్‌పై పట్టు సాధించాలన్నారు. ఈవీఎంలు మోరాయించినప్పుడు, ఇతర సాంకేతిక సమస్య ఉత్పన్నమైనప్పుడు ఏ విధంగా ముందుకెళ్లాలి అన్న అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. మనందరం కుటుంబ సభ్యులమని, చిన్న, చిన్నలోపాలు వుంటాయని, వాటిని సవరించుకొని ముందుకెళ్లాల్సి ఉంటుందన్నారు. రెండు విడతలుగా శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 235 మంది, సాయంత్రం 234 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఉదయం 235 మందికిగాను 212 మంది, మధ్యాహ్నం 234 మందికి గాను 209 మంది శిక్షణకు హాజరు కావడం జరిగిందన్నారు. ఈ శిక్షణా తరగతులలో తహసీల్దారు ఇన్బనాధన్, ఆర్ఐ రాజేష్‌లతోపాటు వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిసే మాసం రంజాన్

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిసే మాసం రంజాన్ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మున్సిపల్ పరిధి రాయుడు కాలనీలోని మసీదు వద్ద మాజీ కౌన్సిలర్ ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌తో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో దైవచింతనతోపాటు నియమబద్ధ జీవితం గడపడం వల్ల క్రమశిక్షణ, సానుభూతి, ఓర్పు, సహనం, సేవాభావం వంటి సద్గుణాలు అలవడుతాయన్నారు. శుభాలు వర్షించే మాసం రంజాన్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌస్‌ఖాన్, ఇర్షాన్, జానం రవీంద్ర, సుగవాసి శ్యామ్, అన్సారలీం, వెంకటేష్, బుజ్జిబీబు, చంద్రశేఖర్, అబుజర్, హజరత్ ఖాదర్‌వలీ, జాఫర్‌అలీఖాన్, నవాజ్‌క్రిష్, ఫైరోజ్, జావీద్, మోక్షిత్, అమీర్, ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



గరుగుపల్లెలో మహిళలతో మాట్లాడుతున్న విజయ్ భాస్కర్

గాలివీడు : కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని బీసీ నాయకుడు విజయ్‌భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని గరుగుపల్లె గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో ముందుకు నడిపించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆసరా, అమ్మ ఒడి, ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను నిజం చేసేలా 30 లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నిరుపేదల పిల్లలు కూడా ఇంగ్లిషు మీడియం చదవాలనే సంకల్పంతో నాడు నేడు కింద బడుల రూపురేఖలు మార్చారన్నారు. కరోనా కష్టకాలంలో కూడా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలను అందించారని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కరోనా కాలంలో తెలంగాణ రాష్ట్రంలో కుటుంబంతో తలదాచుకున్నాడని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే మరోమారు మనమందరం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా మిథున్‌రెడ్డిని, రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గడికోట శ్రీకాంత్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్‌రెడ్డి, సురేష్, సిద్దయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సాయిబాబా మందిర వార్షికోత్సవం



పట్టణంలోని సాయిబాబా మందిరం

రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు మహాగణపతి పూజ, శ్రీ గంగా భగీరథీ పూజ, స్వస్తిపుణ్యాహ వాచనం, పంచగవ్య ,రుత్విగ్వరణం, మాతృక, నాంది పూజలు, ప్రతిరసబంధనం, సర్వతోభద్రమండలార్చనలు, సద్గురు శ్రీ దక్షిణామూర్తి, శ్రీ సాయినాథ పూజలు, గణపతి, నవగ్రహ, రుద్ర, సాయినాథ హోమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. అలాగే 11:30 గంటలకు మహాపూర్ణాహుతి, 12:30కు పూర్ణకుంభాభిషేకం, 1:30కు మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం స్వస్తి పుణ్యాహవాచనం, సాయంత్రం 6:30 నుంచి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ పల్లకీ ఉత్సవం పట్టణ పురవీధులలో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదం అందించడం జరుగుతుందన్నారు. ఈ పూజలలో స్థానిక భక్తులతోపాటు ఇతరా ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావాలని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బయారెడ్డి తెలిపారు.

నడకతో ఎంతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు

రాజంపేట : నడకతో ఎంతో ఆరోగ్యం చేకూరుతుందని వక్తలు తెలిపారు. రాజంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాజంపేట పాతబస్టాండు నుంచి ప్రభుత్వ క్రీడామైదానం వరకు మారదాం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో 300 మంది వాకర్స్ పాల్గొన్నారు. ఈ వాకర్స్ ర్యాలీని పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ప్రారంభించారు. కాగా మారదం కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహన్, సెక్రటరీ ప్రదీప్, కో–ఆర్డినేటర్ రవిలు పాల్గొన్నారు. వాకర్స్ మారదం కార్యక్రమం సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు(కె ఎస్సార్) మాట్లాడుతూ నడుచు, నడిపించు అనే నినాదం విశ్వవ్యాప్తం కావాలన్నదే తమ అభిమతమన్నారు. అనారోగ్యంపై యుద్ధం చేస్తున్న సంస్థ వాకర్ ఇంటర్నేషనల్ సంస్థ అని వెల్లడించారు. నడక వల్ల అనే రుగ్మతల నుంచి రక్షింపబడతామన్నారు. ఉదయం కనీసం అరగంట నడవడం వల్ల మనిషికి మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి రోజు వ్యాయామం చేయాలన్న సంకల్పంతో మారదాం ర్యాలీ నిర్వహించామన్నారు.

నేడు వాకర్స్ ఇంటర్నేషనల్ మీట్

తాళ్లపాక రహదారిలో ఉన్న శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ మీట్ జరుగుతుందని శరత్‌కుమార్‌రాజు తెలియజేశారు. ఈ మీట్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ ముఖ్య ప్రతినిధులు పాల్గొంటారన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్‌ను మరింత బలోపేతం చేసేందుకు అన్ని కార్యక్రమాలను విజయవంతమయ్యేలా నిర్వహిస్తున్నామన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



పల్లెదర్శిని కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ షరీఫ్

సిద్దవటం : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని కడప డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లి గ్రామంలో శ్రీ రేణుకాయల్లమాంబ ఆలయం వద్ద శనివారం సాయంత్రం పల్లె దర్శిని కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరి ఓటు వారు వేసుకొని వారి గృహాలకు వెళ్లాలన్నారు. అలా కాకుండా గ్రామాల్లో ఒకరిపై మరొకరు ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత ఘర్షణకు దూరంగా ఉండాలన్నారు. ఒక్కసారి కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పెద్ద ఓబన్న, మాచుపల్లి గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

ఏపీ పాలిసెట్ ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్ : ఏపీ పాలిసెట్ పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 26 వరకు తరగతులు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. 10వ తరగతి చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలిసెట్ ఎంట్రన్స్ టెస్ట్ ఏప్రిల్ 27వ తేదీ నిర్వహించున్నారని తెలిపారు. రాయచోటి పాలిటెక్నికల్ కళాశాలలో మొదటి సారిగా ఈ ఏడాది శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాలిటెక్నికల్ ఎంట్రన్స్ టెస్ట్ కోసం దరఖాస్తులు ఏప్రిల్ 5వ తేదీలోగా చేసుకోవాలని పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షల హాల్ టికెట్, ఆధార్ కార్డు, (ఓసీ/ బీసీలు) అయితే రూ.400, ఎస్టీ/ఎస్సీలు అయితే రూ.100లతో నేరుగా రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ పొందే విద్యార్థులకు ప్రతి శనివారం మోడల్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు గడువు పెంపు

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాల కోసం ఏప్రిల్ 6వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ తెలిపారు. మార్చి 31వ తేదీ వరకు ఉన్న గడువును విద్యార్థుల సౌలభ్యం కోసం ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంగ్లిషు, తెలుగు మీడియంలలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ ఉంటుందని, ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గుంటూరు రాష్ట్ర సదస్సును జరిపి తీరుతాం

రాయచోటి అర్బన్ : గుంటూరు కేంద్రంగా త్వరలో రాష్ట్ర సదస్సును జరిపితీరుతామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామక్రిష్ణ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30వ తేదీన గుంటూరులో జరగాల్సిన ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఆంక్షల కారణంగా నిలిచిపోయిందన్నారు. ఏప్రిల్ 7న గుంటూరులోనే తిరిగి ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నేతలు దుమ్ము చిన్నా, శివయ్య, రాధాక్రిష్ణ, వెంకటేష్, తిరుపాల్ తోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి



అధ్యక్షుడు, ట్రెజరర్ ప్రభార్‌రెడ్డి, సిద్దయ్య

రాయచోటి టౌన్ : రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్.ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు శనివారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 81 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, అందులో ఒకటి చెల్లని ఓటుగా నమోదైంది. ఎస్.ప్రభాకర్‌రెడ్డికి 47, రవిశంకర్‌కు 33 ఓట్లు వచ్చాయి. దీంతో 14 ఓట్ల మెజార్టీతో ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. అలాగే ట్రెజరర్ పదవి కోసం వెల్పుల సిద్ధయ్య, ఎం.వెంకట్రమణలు పోటీ పడ్డారు. వీరిలో సిద్ధయ్యకు 45, వెంకటరమణకు 35 ఓట్లు వచ్చాయి. సిద్ధయ్య 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా పి.రెడ్డెయ్య, సహాయ కార్యదర్శిగా డి.నాగమునిలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

అడవికి నిప్పు.. వన్యప్రాణాలకు ముప్పు



పాల కొండలకు నిప్పు పెట్టిన దృశ్యం

రామాపురం : పాలకొండలు అడవికి నిప్పు పెట్టడంతో వన్య ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని పలు గ్రామాల రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాలకొండలు దట్టమైన అడవులు కాబట్టి పచ్చగడ్డితో కళకలాడుతూ ఉండేవి. ప్రతి వేసవిలో సీజన్‌లో ఈ ప్రాంతంలో బోధ, గడ్డి, ఎక్కువగా ఉండేదని కొందరు ఆకతాయిలు అడవికి నిప్పు పెట్టడంతో వన్యప్రాణాలకు, పశువులకు గడ్డి లేక పోతుందని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలో పరిధిలోని గువ్వలచెరువు జాతీయ రహదారి నుంచి వంగిమళ్ల పాలకొండల వరకు అడవులు దట్టంగా ఉండడంతో గడ్డి ఎక్కువగా ఉంటుందని, ఈ వేసవిలో ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టడంతో పశువులకు మేత లేకుండా వన్య ప్రాణాలకు మేత లేకుండా పోయిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో నీరు గడ్డి లేకపోవడంతో కొన్ని గ్రామాల ప్రజలు, పశువులను అడవులకు పంపుతూ ఉంటారు. కొండలో నిప్పు పెట్టడంతో గడ్డి దొరకదని, తమ పశువులను ఎలా పెంచుకోవాలని అని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాలకొండల్లో గడ్డి దొరకపోతే ఇతర జిల్లాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొంటున్నారు. కావున సంబంధింత అధికారులు చర్యలు తీసుకొని అడవికి నిప్పు అంటించకుండా చూడాలని వారు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టిస్తే చర్యలు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లి : పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ్‌బాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాలెం గొల్లపల్లి, చింతకుంటవాండ్లపల్లి, రెడ్డివారిపల్లి, లక్కిరెడ్డిపల్లి గ్రామాలలో స్పెషల్ కమాండర్ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఓటు అనేది ప్రజాస్వామ్యాన్ని నిలబెడుతుందని, మీ ఓటు నిర్భయంగా వినియోగించుకోవచ్చన్నారు. ఎలక్షన్ సమయంలో పల్లెల్లో కొత్త వ్యక్తులు కనిపించినా, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. రాత్రి వేళల్లో మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని ఓటర్లకు సూచించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, కావున ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విష్ణువర్ధన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



కొలువుదీరిన సీతారామలక్ష్మణ విగ్రహాలు

ఓబులవారిపల్లె : మండలంలోని కొర్లకుంట గ్రామంలో శ్రీ సీతారామ, లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట చివరిరోజు కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రాతఃకాల, గర్తు పూజలు, యంత్రప్రతిష్ట, ప్రధానహోమం, ప్రాణప్రతిష్ట, మహాకుంభాభిషేకం, మహానైవేద్యం, మహా మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను వేదపండితులు మంత్రోచ్ఛారణలతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. అనంతరం పూజారులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామ పెద్దలను సన్మానించిన దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై బావులకాడపల్లి క్రాస్ వద్ద శనివారం కారు ఢీకొన్న సంఘటనలో వెంకటేశ్వర అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గుట్టపల్లి కస్పాకు చెందిన వెంకటేశ్వర్లు తన ద్విచక్రవాహనంలో పొలం వద్దకు వెళ్తుండగా బావులుకాడపల్లి క్రాస్ వద్ద మలుపు తిరుగుతుండగా పీలేరు వైపు నుంచి రాయచోటికి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.